క్లుప్తంగా

అన్నదానం

కడప ఎడ్యుకేషన్: కడప నగరం చెన్నూరు బస్టాండ్ సమీపంలోని రాస్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రంలో దామోదర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య భువనేశ్వరి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమ ఏర్పాటుకు విశ్రాంత హెచ్‌ఎం లయన్ కల్లూరు బాలయల్లారెడ్డి, విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి నాగమునిరెడ్డి, సొట్టం ప్రసాద్‌రెడ్డిలు సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మానసిక వికలాంగుల పునరావాస కేంద్ర ప్రిన్సిపాల్ లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి

వైవీయూ : సర్దార్ వల్లభాయ్‌పటేల్, స్వామి వివేకానంద వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియరీ మెజిస్ట్రేట్ పి. శంకర్ పేర్కొన్నారు. కడప నగరం ఎన్‌సీసీ నగర్‌లో నిర్వహిస్తున్న 12వ సీఏటీసీ ఎన్‌సీసీ క్యాంపులో గురువారం జేబీవీఎస్ ది ప్రిజెర్వర్ స్వచ్ఛందసేవాసంస్థ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతపై ఎన్‌సీసీ కేడెట్స్‌కు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే సేవాభావం కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విజేతలుగా నిలిచిన కేడెట్స్‌కు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా, డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డా. ఆర్. నీలయ్య, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

నేడు తులసి పూజ

కడప కల్చరల్ : కైశిక ద్వాదశిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక భావనా ఋషి ఆలయంలో తులసి పూజ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6.00 గంటల నుంచి హాజరైన భక్తులు సామూహికంగా లలితా సహస్ర నామపారాయణం చేయనున్నారు. అనంతరం కైశిక ద్వాదశి విశిష్టతల గురించి ధార్మిక ప్రసంగం ఉంటుంది. అనంతరం తులసిమాతను లక్ష్మీదేవిగా భావించి లక్ష్మీతులసి పూజలను నిర్వహిస్తారు. పూజలో పాల్గొనే 250 మంది భక్తులకు తులసి మొక్కలను అందజేయనున్నారు.

వితరణ

కడప కల్చరల్ : థ్యాంక్స్ గివింగ్ డే (కృతజ్ఞతా దినోత్సవం) సందర్భంగా గురువారం కడప నగరంలోని పాత రిమ్స్‌లోగల అల్‌షిఫా మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి రాజారెడ్డివీధిలోగల నారాయణ స్కూలు చిన్నారులు పలు వస్తువులను వితరణగా అందజేశారు. పాఠశాల నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు వస్త్రాలు, కంబళ్లు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, పండ్లు తదితరాలను పాఠశాల ఏజీఎం చెన్నకేశవరాజు ఆధ్వర్యంలో మానసిక వికలాంగ బాలలకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, హేమంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ షబానా ఖానమ్, ఆర్కే రామకృష్ణ శర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు దాతలైన చిన్నారులను అభినందించారు.

అంగన్వాడీల సమ్మె జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: డిసెంబర్ 8న అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ అనుబంధ అంగన్వాడీ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనాలు రూ. 26,000 ఇవ్వాలన్నారు. అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ వర్కర్స్ ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ అనుబంధ సంఘాల నాయకులు లక్ష్మీదేవి, టి. చెన్నమ్మ, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ టి. గంగావతి, మనోహర్, వేణుగోపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పీటీడీ వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు హోదాను ఇవ్వడం అభినందనీయమని వైఎస్‌ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ తమ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుకు, వైఎస్‌ఆర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మల్లి ఖార్జున రెడ్డికి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి, రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాషకు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లి చంద్రయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

సుపరిపాలన కోసం జగనన్నే మళ్లీ రావాలి

రాష్ట్రంలో సుపరిపాలన కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మేధావులు అభిప్రాయపడ్డారు. గురువారం కడప నగరం రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్‌లో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా నేతృత్వంలో వివిధ వర్గాలకు చెందిన మేధావులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు కె.సురేష్‌బాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియాఖానమ్, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంవీ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు పి.రవీంద్రనాథరెడ్డి, డాక్టర్ సుధ, మేడా మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీ బుట్టా రేణుక, టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జిల్లా కోశాధికారి హఫీజుల్లా, డాక్టర్ సొహైల్, రఫీ, జరుగు రాజశేఖర్‌రెడ్డి, జమాల్‌వలీ తదితరులు పాల్గొన్నారు. - కడప కార్పొరేషన్



మేధావుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

లా నేస్తం ఇవ్వడం గొప్ప నిర్ణయం



న్యాయవాదులు, వారి సమస్యల గురించి గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచన చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం పథకం ద్వారా మూడేళ్లపాటు నెలకు రూ.5 వేలు ఇవ్వడం గొప్ప నిర్ణయం. కడపలోని బార్ అసోసియేషన్ భవనాన్ని అప్‌గ్రేడ్ చేసి ఫారెస్టు నేరాలకు సంబంధించిన స్పెషల్ కోర్టు కడపలో ఏర్పాటు చేయాలి. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి.

- జీవీ రాఘవరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కడప

50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేశారు



రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేసింది. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే ఈ వర్గాల్లో ఉన్న పేద నిరుద్యోగయువత కోసం నిరుద్యోగ భృతిని అమలు చేయాల్సిన అవసరం ఉంది.

- శ్రీనివాసులు, ఎస్టీఓ సంఘ నేత



సమావేశానికి హాజరైన మేధావులు

అర్చకులను ఆదుకున్న ముఖ్యమంత్రి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్చకులకు దేవాలయాల్లో వంశ పారంపర్య హక్కులు కల్పించారు. పాలక మండళ్లలో కూడా వారికి ప్రాధాన్యత ఇచ్చారు. అర్చకులు ధూప దీప నైవేద్యాల కోసం గౌరవ వేతనాలు ఇస్తున్నారు. వేద పాఠశాలల్లో చదివే వారికి కూడా అమ్మ ఒడిని వర్తింపజేయాలి. అర్చకులకు కూడా నామినేటెడ్ పదవులు ఇచ్చి జిల్లాలో వేద పాఠశాల ప్రారంభించాలి.

- విజయ్‌భట్టర్, జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షులు

వైద్య రంగానికి ప్రాధాన్యం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఒక వైద్యుడిగా 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వాలు వాటిని తీవ్ర నిర్లక్ష్యం చేశాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ఆ బకాయిలన్నీ చెల్లించారు. బడ్జెట్‌లో 16 శాతం నిధులు వైద్య రంగానికి కేటాయించారు. రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారు.

- డాక్టర్ వారణాసి ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ వైద్యులు

వెనుకబడిన వర్గాలను ఉన్నత స్థాయికి తెచ్చారు



బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు...బ్యాక్ బోన్ క్లాస్‌గా చేస్తామని ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు తగినట్లుగానే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పించారు. వైఎస్సార్ సీపీకి ఎనిమిది రాజ్యసభ స్థానాలు రాగా, అందులో నాలుగు స్థానాలను బీసీలకుఇచ్చి నలుగురిని ఎమ్మెల్సీలుగా చేశారు. కడపలో అత్యంత విలువైన 20 సెంట్ల స్థలాన్ని బీసీ భవన్‌కు కేటాయించారు.

- లింగమూర్తి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు

జీఎస్టీ బకాయిల చెల్లింపునకు ఓటీఎస్ తేవాలి



కోవిడ్ మహమ్మారి ప్రభావం వల్ల దేశంతో పాటు మన రాష్ట్రంలో అనేక వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో చాలా మంది నష్టపోయారు. చాలా పరిశ్రమలు మూతపడ్డాయి. ఈ దశలో చాలామందికి జీఎస్టీ బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ స్కీమ్ తెస్తే వ్యాపారులకు ఎంతో మేలు జరుగుతుంది. జాతీయ ఉపాధి హామి పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

- షరీఫ్, ఆడిటర్ , కడప

కాపులకు మేలు చేసింది జగనే



చంద్రబాబు కాపులను బీసీల్లో చేరుస్తామని మోసం చేశారు. కాపులను బీసీల్లో చేర్చే అంశం తన పరిధిలో లేదని జగన్‌మోహన్‌రెడ్డి మొదటి నుంచి చెబుతూ వస్తున్నారు. అయినప్పటికీ తన పరిధిలో ఉన్న మేరకు కాపులకు ఐదు మంత్రి పదవులు ఇవ్వడమే కాకుండా ఇద్దరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. ఈబీసీ రిజర్వేషన్లలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించారు. కడపలో కాపు భవన్ నిర్మించాలి.

- చెన్నంశెట్టి మురళి, రాయలసీమ బలిజ సంఘ నేత

వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలి



గతంలో వాల్మీకులు ఎస్టీ జాబితాలో ఉండేవారు. వారిని అదే జాబితాలో కొనసాగించాలని అనేక ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ప్రభుత్వాలు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతున్నాయేగానీ కేంద్ర ప్రభుత్వం దానిని ఆమోదించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించే విధంగా చర్యలు చేపట్టాలి. జిల్లా కేంద్రంలో వాల్మీకి దేవాలయాన్ని నిర్మించాలి.

- రామచంద్ర, వాల్మీకి సేవా సంఘం నాయకులు

దేశ చరిత్రలో విప్లవాత్మక పాలన



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశ చరిత్రలో విప్లవాత్మక పాలన అందించారు. విద్యా రంగంలో పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు దూర దృష్టితో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక పథకాలు ఇందుకు ఉదాహరణలు. గతంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చెప్పులు లేకుండా, చిరిగితపోయిన బట్టలతో ఉండేవారు. ఇప్పుడు మంచి యూనిఫాం, షూ, బెల్ట్, టై, బ్యాగు, పుస్తకాలు పాఠశాల ప్రారంభంలోనే ఇస్తున్నారు. విద్యాహక్కుల చట్టాన్ని అమలు చేసి ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం చారిత్రాత్మకం.

- సాంబశివారెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్, కడప

అంబరమంటిన సంబరం

కడప కార్పొరేషన్: కడప నగరంలో గురువారం నిర్వహించిన సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో సందడి నెలకొంది. కేరళ వాయిద్యాల ప్రత్యేకత.. గుర్రాల ర్యాలీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో 'ఆంధ్రాకు జగనన్నే మళ్లీ సీఎం కావాలి' పోస్టర్లను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, రమేష్ యాదవ్‌లు ఆవిష్కరించారు. గురువారం స్థానిక యూఎస్ మహల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు జగనన్న ప్రభుత్వంలో చేసిన మేలు గురించి పోస్టర్లు రూపొందించిన సీహెచ్ వినోద్‌ను అభినందించారు. మార్కెట్ యార్డు చైర్ పర్సన్ గంగాదేవి పాల్గొన్నారు.



కడప నగరంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో పాల్గొన్న నాయకులకు హారతి పడుతున్న అభిమానులు



సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కటౌట్‌కు పాలాభిషేకం చేస్తున్న అభిమానులు



సాధికార బస్సు యాత్ర కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా గుర్రాల ర్యాలీ



కేరళ వాయిద్యకారుల సందడి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ప్రజాప్రతినిధులు

మంత్రికి వినతి

కడప ఎడ్యుకేషన్: ప్రైవేటు టూవీలర్ మెకానికల్‌లను అసంఘటిత కార్మికుల జాబితాలో చేర్పించి వారికి పథకాలను వర్తింప చేయాలని ది కడప ప్రైవేటు టు వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మహబూబ్‌బాషా, నగర ఉపాధ్యక్షులు లయన్ ఫటాన్ ఖాదర్‌బాష కోరారు. ఈ విషయమై గురువారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాష ద్వారా ఇన్‌చార్జ్ మంత్రి ఆదిమూలం సురేష్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

డ్రైవింగ్‌లో అత్యుత్తమ శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప డిపోల్లో ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 18వ బ్యాచ్ అభ్యర్థులకు శిక్షణను ఆయన ప్రారంభించి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ 19వ బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఒక్కో బ్యాచ్‌కు 16 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. 30 ఏళ్ల అనుభవం గల రీజనల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ చేత థియరీ, ప్రాక్టికల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ గోపాల్‌రెడ్డి, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.



18వ బ్యాచ్ అభ్యర్థులతో ఈడీ, ఆర్‌ఎం, డీఎం

ఘన సన్మానం



డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రిమ్స్ ఎంఎన్‌ఓలు, వైద్య సిబ్బంది

కడప అర్బన్: కడప సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో సూపర్ స్పెషాలిటీ విభాగంకు ప్రత్యేకంగా సూపరింటెండెంట్‌గా నియమితులై, బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డిని వైద్యులు, అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. గురువారం ఆయనను ఛాంబర్‌లో ఎంఎన్‌ఓలతో పాటు, వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూలబొకేను అందచేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

వైవీయూ : విద్యార్థులు పోటీపరీక్షలకు సన్నద్ధం కావాలని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీం బాషా పేర్కొన్నారు. గురువారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ కళాశాలలో ఎంపిక చేసిన 100 మంది విద్యార్థినులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక పోటీపరీక్షల శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా. గురుమోహన్‌రెడ్డి మాట్లాడారు.

బీఏ ఎకనామిక్స్ ఆనర్స్ డిగ్రీ మంజూరు..

ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు బీఏ ఆనర్స్ డిగ్రీ అర్థశాస్త్రంలో మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

వైవీయూ జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో కడప ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో పాటు ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీవివేకానంద, , నాగార్జున, శ్రీహరి డిగ్రీ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 400 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించామన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

బిస్కెట్స్ తయారీతో ఆర్థిక స్వావలంబన

కడప అగ్రికల్చర్: చిరుధాన్యాల బిస్కెట్స్ తయారీతో సులభంగా ఆర్థిక స్వావలంబనను సాధించవచ్చని ఊటుకూరు ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఊటుకూరు ఏరువాక కేంద్రంలో అంతర్జాతీయ చిరుధాన్యపు సంవత్సరం సందర్భంగా రెండవ రోజు యువ, మహిళా, అభ్యుదయ రైతులకు మిల్లెట్ బిస్కెట్ తయారీపై నైపుణ్య శిక్షణను నిర్వహించారు. ఇందులోభాగంగా జొన్న, సొద్ద, కొర్ర, రాగులతో బిస్కెట్ తయారీ గురించి ప్రయోగాత్మక తరగతులను నిర్వహించారు. కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆత్మ డీపీడీ పద్మలత, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రామలక్ష్మిదేవి పాల్గొన్నారు.



బిస్కెట్స్ తయారీపై రైతులకు శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్తలు